
సాక్షి శ్రీకాకుళం

మంగళవారం | 29 | అక్టోబర్ | 2024



మిల్లర్లకు మోకాలడ్డు

ఖరీఫ్ మిల్లింగ్ చార్జీలు ప్రభుత్వం చెల్లించడం లేదు. దీంతో మిల్లర్లు ఆందోళన చెందుతున్నారు.

- 10లో



సీమెన్ ఆత్మహత్య

బందరువానిపేటలో సీమెన్ ఆత్మహత్య చేసుకున్నాడు. 5 రోజుల కిందటే అతను ఇంటికి వచ్చాడు.

- 10లో



డీఆర్ఓ బాధ్యతల స్వీకరణ

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా రెవెన్యూ అధికారిగా మారెళ్ల వెంకటేశ్వరరావు సోమవారం ఉదయం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

న్యూస్‌రీల్

సీఎం సభకు స్థల పరిశీలన



పద్మతుల గ్రామంలో స్థల పరిశీలన చేస్తున్న ఎమ్మెల్యే బెందాళం అశోక్, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ మహేశ్వర రెడ్డి

కంచిలి: నవంబర్ ఒకటో తేదీన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఇచ్ఛాపురం నియోజకవర్గానికి రానున్నారు. ఈ మేరకు సీఎంఓ కార్యాలయం నుంచి వచ్చిన సమాచారం మేరకు జిల్లా యంత్రాంగం ఇచ్ఛాపురం నియోజకవర్గంలో సీఎం సభకు స్థల పరిశీలన చేపట్టింది. ఆదివారం రాత్రి నుంచి సోమవారం సాయంత్రం వరకు సోంపేట మండలం కొర్లాం జాతీయ రహదారి పక్కన, కంచిలి మండలం పద్మతుల గ్రామంలో సభా స్థలి, మకరాంపురంలో హెలీప్యాడ్ ఏర్పాటుకు స్థలాలను పరిశీలించారు. ఇచ్ఛాపురం మండలం ఈదుపురం గ్రామంలో కూడా స్థల పరిశీలన చేశారు. కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే బెందాళం అశోక్‌తోపాటు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి, సీఐ బి.మంగరాజు, తహసీల్దార్ ఎన్.రమేష్‌కుమార్, ఎంపీడీఓ వి.తిరుమలరావు టీడీపీ నేతలు ఉన్నారు.

దళిత మహిళపై దాడి అమానుషం

- మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం, టెక్కలి వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి పేరాడ తిలక్



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చల్ల దమయంతికి మాజీ స్పీకర్ పరామర్శ

కోటబొమ్మాళి: దళిత మహిళపై దాడి చేయడం అమానుషమని, రాష్ట్రంలో చంద్రబాబు అరాచక పాలన సాగిస్తున్నారని మాజీ స్పీకర్, వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ ఇన్‌చార్జి తమ్మినేని సీతారాం, టెక్కలి వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి పేరాడ తిలక్ అన్నారు. టీడీపీ వర్గీయుల దాడిలో తీవ్రంగా గాయపడి కోటబొమ్మాళి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చల్ల దమయంతిని వారు సోమవారం పరామర్శించి మీడియాతో మాట్లాడారు. వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు టార్గెట్ చేస్తుంటే పోలీసులు చోద్యం చూస్తున్నారని విమర్శించారు. ఫిర్యాదులు కూడా తీసుకోవడం లేదని తెలిపారు. కోటబొమ్మాళి మండలం కిష్టుపురంలో ఇంటిలోకి దూరి దళిత మహిళపై దాడి చేశారని, కాశీబుగ్గ పోలీస్‌స్టేషన్‌లోనే వైఎస్సార్ సీపీ కార్యకర్తలను కొట్టారని, ఎస్పీ బాధితులకు అండగా నిలవాలని కోరారు. బాధితులకు పార్టీ అండగా ఉంటుందని, ప్రభుత్వంపై అన్ని వర్గాల ప్రజలు తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారని, జమిలి ఎన్నికలు వస్తే వైఎస్సార్ సీపీ గెలుపు ఖాయమని అన్నారు. అనంతరం కోటబొమ్మాళి ఎస్ఐ వి.సత్యనారాయణను పేరాడ తిలక్ కలిసి బాధితులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ దుబ్బ వెంకటరమణారావు, నందిగాం ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తి, వైఎస్సార్ సీపీ నాయకులు రోణంకి మల్లయ్య, బోయిన నాగేశ్వరరావు, ఎస్.హేమసుందరరాజు, దుక్క రామకృష్ణ, రాంపాత్రుని శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సౌత్‌జోన్ కబడ్డీ పోటీలకు కోచ్‌గా బాలకృష్ణ

శ్రీకాకుళం న్యూకాలనీ: సౌత్‌జోన్ అంతర్ యూనివర్సిటీ కబడ్డీ చాంపియన్‌షిప్ పోటీలకు జిల్లాకు చెందిన పీడీ ఎం.బాలకృష్ణ కోచ్‌గా వ్యవహరించనున్నారు. ఈనెల 30 నుంచి నవంబర్ 2వ తేదీ వరకు తమిళనాడులోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీ వేదికగా జరగనున్న ఈ పోటీల్లో పాల్గొనున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ కబడ్డీ జట్టుకు బాలకృష్ణ కోచ్‌గా నియామకమయ్యారు. వర్సిటీ ఉన్నతాధికారుల నుంచి ఉత్తర్వులు అందుకున్నారు.

సమ్‌థింగ్ స్పెషల్

దీపాలు.. కొంగొత్త రూపాలు



విద్యుత్‌తో వెలిగే దీపం



బ్యాటరీతో వెలిగే విభిన్న రకాల దీపాకృతులు

దీపాల పండక్కి కొత్త దీపాలు వచ్చేశాయి. సాధారణ మట్టి దీపాలతో పాటు నీటితో వెలిగే దీపాలు, కొవ్వొత్తి దీపాలు, బంగారు దీపాలు వంటివి మార్కెట్‌ను ముంచెత్తుతున్నాయి. ముఖ్యంగా నీటితో వెలిగే దీపాలపైనే అందరి దృష్టి ఉంది. ఈ బ్యాటరీ దీపం కలువ పువ్వు ఆకారంలో ఉంటుంది. మధ్యలో దీపం ఉంటుంది. కిందన నీరు పోసి మీదన ఉంచితే చక్కగా అందంగా వెలుగుతుంది. దీని ఖరీదు మార్కెట్‌లో కేవలం రూ.60లే. సాధారణంగా దీపం వెలగించాలంటే మనం నూనె పోయాల్సి ఉంటుంది. అయితే ఈ దీపానికి నూనె అవసరం లేదు. నీరు పోస్తే చాలు చాలు. పర్యావరణానికి ఎలాంటి హాని ఉండదు. బ్యాటరీ దీపాలు కూడా కొత్తగా కనిపిస్తున్నాయి. ఇక వేలాడే దీపాలను కూడా జనం ఇష్టపడుతున్నారు.

- శ్రీకాకుళం కల్చరల్



నీటితో వెలుగుతాయి..

మట్టి ప్రమిద రూపంలో..



కలువపువ్వు ఆకారంలో..



దీపం ఆకృతిలో..



మొన్న కాశీబుగ్గ టౌన్‌లో నడిబొడ్డున సీదిరి అప్పలరాజు అనుచరుడు, పాత్రికేయుడు అల్లు రమణపై కత్తితో దాడి చేసి హతమార్చేందుకు కొర్ల విష్ణు చౌదరి అనే టీడీపీ నాయకుడు ప్రయత్నించాడు. ఆ దాడిలో తప్పించుకుని ఫిర్యాదు చేసేందుకు వైఎస్సార్‌సీపీ నాయకుడు మొదలవలస మన్మధరావుతో కలిసి కాశీబుగ్గ పోలీసు స్టేషన్‌కు వెళ్లగా ఏకంగా స్టేషన్‌లోనే దాడికి దిగారు.



ఈ నెల 19వ తేదీన ఇంటి దగ్గర తల్లిదండ్రులు లేని సమయంలో టీడీపీకి చెందిన పైల శివ, మోహనరావు, రాజమహేంద్రం సాయి అనే ముగ్గురు వ్యక్తులు బర్త్‌డే పార్టీకని ఇద్దరు బాలికల్ని తీసుకెళ్లి లైంగికదాడికి పాల్పడ్డారు. వీరిలో శివ, మోహనరావుల బంధువులు టీడీపీ వర్గీయులు.

తమ బృందంతో కాకుండా వేరే బృందంతో డాన్సు ప్రోగ్రామ్‌లకు వెళ్తున్నారని పలాస మండలం బొడ్డపాడుకు చెందిన తల్లీకూతుళ్లు నాగమణి, సుదీష్ణలపై తాళ్లభద్ర వద్ద అర్ధరాత్రి దారి కాచి పలాస మండల టీడీపీ యువత అధ్యక్షుడు కిక్కర డిల్లీరావు దాడి చేశాడు. బాధిత మహిళలు పోలీసు స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేయకుండా అడ్డుకునే ప్రయత్నం చేశారు.





రెండు నెలల క్రితం పలాస మండలం కిష్టుపురం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు బూర్లె మోహనరావును విచారణకు పిలిచి కాశీబుగ్గ పోలీసు స్టేషన్‌లో బూర్లె సూర్య కృష్ణంరాజు అనే టీడీపీ నాయకుడు రక్తం వచ్చినట్టు కొట్టారు.



ఎన్నికల ఫలితాలు వచ్చిన నాలుగు రోజుల్లోనే గుండు మోహన్ అనే వైఎస్సార్‌సీపీ నాయకుడిపై టీడీపీ నాయకులు దాడి చేసి, తల పగిలేలా గాయపరిచారు.



వజ్రపుకొత్తూరు మండలంలోని పాతటెక్కలికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు ఎం.దానయ్య, కొల్లి మౌర్య, కొల్లి దామోదరరావులపై అదే గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్తలు ఎం.గిరి, ఎం.గంగయ్యలు ఈ నెల 15 అర్ధరాత్రికి దాడికి పాల్పడ్డారు. బాధితులకు తీవ్ర గాయాలయ్యాయి.

ఇంకొన్ని..

- వజ్రపుకొత్తూరు మండలంలోని డోకులపాడు గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు పాపారావుపై అక్కడి టీడీపీ నాయకుడు దాడి చేయడమే కాకుండా ఆసుపత్రికి వెళ్లనియకుండా పోలీసులతో నిర్బంధించారు.
- ఇటీవల పలాస అత్యాచార ఘటన నిందితుల కుటుంబ సభ్యులకు చెందిన ఫొటోలను సోషల్ మీడియాలో షేర్ చేశారని పిడి మందస గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త గుంపు జగదీష్‌ను వేధించారు. విచారణ పేరుతో భయభ్రాంతులకు గురి చేశారు.
- వారం రోజుల క్రితం మందస మండలం గిరిజన గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకుడిపై కత్తితో దాడి చేశారు.
- గత వారంలోనే మందస మండలం మర్రిపాడు గ్రామంలో ఇద్దరు వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులైన మహిళలపై టీడీపీ నాయకులు దాడి చేసి, గాయపరిచారు.

పలాసలో పచ్చరౌడీల ప్రకోపం



- రెచ్చిపోతున్న టీడీపీ మూకలు
- మహిళా ఎమ్మెల్యే శిరీష అడ్డాలో మహిళలకు భద్రత కరువు
- ఒకవైపు అత్యాచారాలు, మరోవైపు దాడులు
- పోలీసు స్టేషన్‌లోనే రక్షణ లేని పరిస్థితి
- పతాక స్థాయికి చేరిన వేధింపులు
- అకృత్యాల్లో టాప్‌లో నిలిచిన పలాస

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

తాత, తండ్రి వారసత్వం అంటూ గొప్పలు చెప్పుకునే మహిళా నేత గౌతు శిరీష ఎమ్మెల్యేగా ఉన్న పలాస నియోజకవర్గంలో మహిళలకు భద్రత లేకుండా పోయింది. కొన్ని రోజులుగా జరుగుతున్న దాడులు, అత్యాచారాలు, హత్యాయత్నాలు చూస్తుంటే అక్కడి పచ్చ మూకలు ఎంత బరితెగించాయో అర్థమవుతోంది. నియోజకవర్గ కీలక నేతే ఇలాంటి ఘాతుకాలకు పాల్పడుతున్న వారిని ప్రోత్సహించడమే కాకుండా పోలీసు స్టేషన్‌లలో కేసు నమోదు కాకుండా, అత్యాచారాలకు పాల్పడిన వ్యక్తులతో బాధితులను రాజీ చేయించే ప్రయత్నం చర్చనీయాంశంగా మారింది. ఒక మహిళా ఎమ్మెల్యే ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలో మహిళలకు రక్షణ లేకపోయింది. బాధితుల పక్షాన నిలబడే వారిపై తిరిగి కేసులు పెట్టడం, వేధింపులకు గురి చేయడం చేస్తుంటే జనాలకు ఆశ్చర్యమనిపిస్తోంది. దాడులు, అత్యాచారాలు, వేధింపులకు గురి చేస్తున్న వారంతా ఎమ్మెల్యే అనుచరులుగా ముద్రపడ్డ వారే.

దాడుల్లో పలాస టాప్..

పలాస నియోజకవర్గంలో పూర్తిగా శాంతిభద్రతలు లోపించాయి. మహిళా ఎమ్మెల్యే ఉన్న నియోజకవర్గంలో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఇంటిలో నుంచి బయటికొస్తే ఏమవుతుందో తెలియని ఆందోళనలో ఉన్నారు. ప్రశాంతంగా ఉన్న పలాస నియోజకవర్గంలో హింసాత్మక, భయానక పరిస్థితుల్ని సృష్టించడంతో ప్రజలు బెదిరిపోతున్నారు. దాడులు, అకృత్యాల్లో పలాస నియోజకవర్గం టీడీపీ నాయకులు నంబర్ వన్‌గా నిలవగా, తామేమీ తక్కువ కాదన్నట్టు ఆమదాలవలస, శ్రీకాకుళం, టెక్కలి, నరసన్నపేట, ఎచ్చెర్ల, ఇచ్ఛాపురం నియోజకవర్గాల్లో టీడీపీ గూండాలు రెచ్చిపోతున్నారు.

పోలీసుల గుప్పెట్లో పలాస

- మరోసారి సీదిరి హౌస్ అరెస్టు



మాజీ మంత్రి అప్పలరాజును అడ్డుకుంటున్న పోలీసులు

కాశీబుగ్గ: మాజీ మంత్రి సీదిరి అప్పలరాజును పోలీసులు సోమవారం కూడా హౌస్ అరెస్టు చేశారు. గత నాలుగు రోజులుగా పలాస నియోజకవర్గంలో బాలికలపై అత్యాచారాలు, మరో బాలికపై తెలుగుదేశం నాయకుల దాడుల వంటి సంఘటనల నేపథ్యంలో మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు నిరసన కార్యక్రమాలు చేపడతారని నిర్బంధించారు. తొలుత ఆదివారం పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని జీఎంఆర్ కాలనీలో ఆయన ఇంటిలో హౌస్ అరెస్టు చేశారు. మళ్లీ సోమవారం కూడా ఆయనను బయటకు రానీయకుండా అడ్డుకున్నారు. పలాస, మందస, వజ్రపుకొత్తూరు మండలాలతో పాటు పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీలో వైఎస్సార్ సీపీ నాయకులు రాకుండా అడ్డుకున్నారు. హరిపురం, అక్కుపల్లి, బెండిగేటు, మొగిలిపాడు ప్రధాన కూడళ్లలో పోలీసులు మోహరించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ నాయకులు డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని అన్నారు. 1980–95 మధ్యలో పలాస రక్తపాతంగా ఉండేదని, తిరిగి అలాంటి పరిస్థితులు తీసుకువస్తున్నారని అన్నారు. పోలీసు స్టేషన్‌కు వెళ్లడానికి కూడా అనుమతులు ఇవ్వడం లేదని అన్నారు.

వినతి పత్రాలైనా తీసుకుంటారా..?

- పోలీసులకు మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం సూటి ప్రశ్న



మాట్లాడుతున్న మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం, చిత్రంలో మాజీ మంత్రి సీదిరి, ఎమ్మెల్సీ నర్తు రామారావు

పలాస: జిల్లాలో పరిస్థితులు నానాటికీ దిగజారుతున్నాయని, ఇవే పరిస్థితులు కొనసాగితే పోలీస్‌స్టేషన్లకు పసుపు రంగు వేస్తామని, ప్రజా క్షేత్రంలో తేల్చుకుంటామని మాజీ స్పీకర్, వైఎస్సార్ సీపీ శ్రీకాకుళం పార్లమెంటరీ నియోజకవర్గ పరిశీలకుడు తమ్మినేని సీతారాం, మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. ఇటీవల కాశీబుగ్గ పోలీసు స్టేషన్‌లో టీడీపీ దాడిలో గాయపడిన అల్లు రమణ, మొదలవలస మన్మధరావులను పరామర్శించేందుకు తమ్మినేని సీతారాం పలాస వచ్చారు. అయితే ఈ విషయం తెలుసుకున్న పోలీసులు అడుగడుగునా అడ్డంకులు పెట్టారు. చివరికి మాజీ మంత్రి అప్పలరాజు స్వగృహానికి ఆయన హాజరై విలేకరులతో మాట్లాడారు. కాశీబుగ్గలో మొన్న కాక నిన్న ఇద్దరు బాలికలపైన అత్యాచారాలు జరిగాయని, అలాగే మరో బాలికకైన దాడి చేశారని, ఆ తర్వాత పోలీసు స్టేషన్‌లోనే తమ కార్యకర్తలను కొట్టారని ఈ పరిస్థితులు దేనికి సంకేతమని ప్రశ్నించారు. జిల్లా ఎస్పీకి పోలీసు వ్యవస్థ మీద కంట్రోలు లేదన్నారు. అందుకే కలెక్టరుకు, జిల్లా ఎస్పీకి కనీసం వినతిపత్రాలైనా ఇస్తామని అందుకు అవకాశం కల్పించాలని కోరారు. తాము ఇచ్చిన వినతిపత్రాలు తీసుకోవడానికి వారు కూడా భయపడుతున్నారన్నారు. మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు మాట్లాడుతూ రాష్ట్రంలో మానవ హక్కులు లేవన్నారు. పలాస ఎమ్మెల్యే శిరీష చంద్రబాబు, లోకేష్ మెప్పు కోసం ఇష్టానుసారంగా ప్రవర్తిస్తున్నారని అన్నారు. పలాసలో మళ్లీ జీఎస్టీ మొదలైందన్నారు. గౌతు లచ్చన్న, శివాజీ లక్షణాలేవీ శిరీషలో లేవని విమర్శించారు. తనను పశువుల మంత్రి అని సంబోధించే ఎమ్మెల్యే ఇప్పుడు ఆ శాఖ చూస్తున్న అచ్చెన్నాయుడును కూడా ఇలాగే సంబోధిస్తారా అని ప్రశ్నించారు. ఎప్పుడూ రోజులు ఇలానే ఉండవని, మళ్లీ మా రోజులు వస్తాయని హెచ్చరించారు. అనంతరం పోలీసు బందోబస్తు మధ్యనే బాధితులు అల్లురమణ, మొదలవలస మన్మధరావు ఇళ్లకు వెళ్లి వారి కుటుంబాలను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ నర్తు రామారావు, మందస ఎంపీపీ డొక్కర దానయ్య, వైఎస్సార్ సీపీ నాయకుడు ఉంగ సాయికృష్ణ, పాలిని శ్రీనివాసరావు, బోర కృష్ణారావు, పలాస కాశీబుగ్గ మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

పాశ్చాత్య దేశాల్లో కూచిపూడికి గౌరవం



మాట్లాడుతున్న స్వాతీ సోమనాథ్

శ్రీకాకుళం రూరల్: పాశ్చాత్య దేశాల్లో కూచిపూడికి ఎనలేని గౌరవం ఇస్తున్నారని సంప్రదాయ గురుకులం డైరెక్టర్ స్వాతీసోమనాథ్ తెలిపారు. కల్లేపల్లిలో గల సంప్రదాయ గురుకులంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. 2015లో సంప్రదాయ గురుకులాన్ని రూ.5కోట్లు వెచ్చించి ప్రారంభించామన్నారు. మొదటిబ్యాచ్ (2019)కు చెందిన యామిని కసిరెడ్డి జూనియర్ ద్రౌపతిగాను, కొత్రబలరాం అర్జునుడిగాను, తాను సీనియర్ ద్రౌపతిగా సెప్టెంబర్ 11 నుంచి అక్టోబర్ 15 వరకూ నెలరోజులు పాటు ఇంగ్లాండ్, ఐర్లాండ్, స్కాట్లాండ్ దేశాల్లో సంప్రదాయ ప్రదర్శనలు ఇచ్చామని చెప్పారు. ఇంటర్నేషనల్, యూకే సీఈఓ టి.పద్మావతి ఆహ్వానం మేరకు యూకేలో అటానమస్ కల్చరల్ ఫెస్టివల్ పేరిట ప్రదర్శనలు ఇచ్చినట్లు తెలిపారు. ఇంగ్లండ్‌లో ఇచ్చిన ప్రదర్శనలకు గాను కాన్సిలేట్ జనరల్ తనను సత్కరించినట్లు తెలిపారు. అలాగే కూచిపూడి కల్చరల్ ఐకాన్ అవార్డును తీసుకున్నట్లు ఆమె వెల్లడించారు. నవంబర్ 8న మలేషియాలో సామాజిక సందేశాత్మక ప్రదర్శనలు ఇస్తున్నట్లు చెప్పారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



రక్తదాన శిబిరంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి, జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్

శ్రీకాకుళం క్రైమ్ : రక్తదానం ప్రాణదానంతో సమానమని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం పోలీసు అమరవీరుల స్మారకోత్సవాల్లో భాగంగా ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో ఉచిత మెగావైద్యశిబిరం, రక్తదాన శిబిరాలు నిర్వహించారు. ఈ శిబిరాలు రిమ్స్ ఆస్పత్రి, మెడికవర్ ఆస్పత్రి, ఇండియన్ రెడ్‌క్రాస్‌సొసైటీలు నిర్వహించగా ఎస్పీ మహేశ్వరరెడ్డి, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌లు ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ విలేకరులతో మాట్లాడుతూ పోలీసు సిబ్బందితో పాటు యువత, విద్యార్థులు, ప్రజలు ఇలాంటి కార్యక్రమాల్లో స్వచ్ఛందంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. 29, 30 తేదీల్లో టెక్కలి, కాశీబుగ్గ సబ్‌డివిజన్లలో ఈ శిబిరాలు నిర్వహిస్తారన్నారు. ఎస్పీ మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ పోలీసులు తమ ఆరోగ్యం చక్కగా కాపాడుకోవాలని, విధి నిర్వహణలో ఒత్తిళ్లు ఉండటం సహజమని, ఆరోగ్యం కూడా ప్రాధాన్యమైనదేనన్నారు.

క్లుప్తంగా

జాతీయ స్థాయి పోటీలకు విద్యార్థిని ఎంపిక



విద్యార్థినిని అభినందిస్తున్న ఉపాధ్యాయ సిబ్బంది

టెక్కలి: స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలకు చెందిన గేదెల ఏకాక్షరి జాతీయ స్థాయి అథ్లెటిక్ క్రీడలకు ఎంపికైంది. ఈ సందర్భంగా సోమవారం విద్యార్థినిని పాఠశాల హెచ్ఎం ఎస్.శోభారాణితో పాటు సిబ్బంది అభినందించారు. పోటీల్లో ఉత్తమ ప్రదర్శన కనబర్చాలని ఆకాంక్షించారు.

ఎస్పీ గ్రీవెన్స్‌కు 48 అర్జీలు



వృద్ధుడి గోడు వింటున్న డీఎస్పీ వివేకానంద

శ్రీకాకుళం క్రైమ్: జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన మీకోసం పరిష్కార వేదికకు 48 అర్జీలు వచ్చాయి. శ్రీకాకుళం డీఎస్పీ సీహెచ్ వివేకానంద ఫిర్యాదుదారుల నుంచి అర్జీలు అందుకోవడమే కాకుండా సమస్యలు ఎస్పీకి నివేదిస్తామని, త్వరితగతిన పరిష్కరించేలా కృషి చేస్తామని భరోసా ఇచ్చారు. వచ్చిన ఫిర్యాదుల్లో మూడు అదృశ్య కేసులు ఉండడం గమనార్హం.

అ'పూర్వ' సమ్మేళనం



పూర్వపు విద్యార్థులతో ఆనాటి ఉపాధ్యాయులు

సంతబొమ్మాళి: చదువులమ్మ ఒడిలో కలిసి చదువుకున్న నాటి విద్యార్థులు 41 ఏళ్ల తర్వాత కలుసుకున్నారు. అప్పటి తరగతి గదిని తనివి తీరా చూసుకుని జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. మండలంలోని నౌపడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం 1982–83 బ్యాచ్ 10వ తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. దీనిలో భాగంగా అప్పటి గురువులు విజయనందరాజు, రామమునికృష్ణారావు శర్మలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వపు విద్యార్థులు గిరిధర శర్మ, కొంచాడ దామోదర్‌రావు, ఎల్.రాజశేఖర్‌రెడ్డి, రంగారావు, మక్క రాజారావు ఉన్నారు.

మహిళకు గాయాలు

నరసన్నపేట: మండలంలోని నర్సింగరాయుడుపేట వద్ద ఆర్అండ్‌బీ రహదారిపై జరిగిన ప్రమాదంలో ఉర్లాంకు చెందిన దొప్పల పద్మకు తీవ్రగాయాలయ్యాయి. కుమారుడు లోకేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ సీహెచ్ దుర్గాప్రసాద్ తెలిపారు. ఉర్లాం నుంచి ద్విచక్ర వాహనంపై లుకలాం వైపు ఆదివారం వెళ్తుండగా నర్సింగరాయుడుపేట వద్దకు వచ్చేసరికి ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీ కొనడంతో ప్రమాదం జరిగింది. గాయపడ్డ పద్మ శ్రీకాకుళంలోని ఒక ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. సోమవారం కుమారుడు లోకేష్ ఫిర్యాదు చేశాడు.

14న విచిత్ర వేషధారణ పోటీలు

శ్రీకాకుళం కల్చరల్: బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని నవంబర్ 14న చిన్నారులకు విచిత్ర వేషధారణ పోటీలు నిర్వహించనున్నట్లు మిమిక్రీ శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బొంతావారివీధిలో ఉన్న శ్రీకృష్ణార్జున మందిరంలో నిర్వహిస్తున్నామన్నారు. 4 నుంచి 8 ఏళ్ల వయస్సు ఉన్నవారికి ఒక విభాగంగా, 8 ఏళ్ల నుంచి 10 ఏళ్ల బాలలకు ఒక విభాగంగా పోటీలు జరుగుతాయని తెలిపారు. రెండు విభాగాలకు వేర్వేరుగా బహుమతులు ఇస్తామన్నారు. అలాగే పాల్గొన్నవారికి సైతం కూడా గిఫ్టు హేంపర్ ఉంటుందని తెలిపారు. ఆయితే ముందుగా పేర్లు నమోదు చేసుకునేవారికే అవకాశం ఉంటుందన్నారు. కేవలం ఒక విభాగానికి 25 మందిని మాత్రమే తీసుకోవడం జరుగుతుందని, అందువలన ముందుగా తమ పేర్లను 94410 72762 నంబర్‌కి కాల్ చేసి నమోదు చేసుకోవాలన్నారు.

మిల్లర్లకి మోకాలడ్డు..!



- ఖరీఫ్ మిల్లింగ్ చార్జీలు చెల్లించని ప్రభుత్వం
- దాదాపు రూ.42.30 కోట్ల బకాయిలు
- ఆందోళన చెందుతున్న మిల్లర్లు

శ్రీకాకుళం పాతబస్టాండ్:

అధికారంలోకి వచ్చాక అన్నివర్గాలను ఇబ్బందులకు గురి చేస్తున్న కూటమి ప్రభుత్వం, మిల్లర్లకు సైతం మోకాలడ్డుతోంది. గత ఖరీఫ్ మిల్లింగ్ చార్జీల కోసం పాలకుల చుట్టు ప్రదక్షిణలు చేయించుకుంటోంది. ఈ ఏడాది సీజన్ ప్రారంభం కానున్నప్పటికీ ఇంకా గత సీజన్ చెల్లింపులు చేయలేదని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ధాన్యం సేకరణ చేశాక మిల్లులు ఆ ధాన్యాన్ని మిల్లింగ్ చేసి, బియ్యాన్ని తిరిగి సివిల్ సప్లయ్ కార్పొరేషన్‌కి అందజేస్తారు. అలా ధాన్యాన్ని బియ్యంగా మిల్లింగ్ చేసినందుకు మిల్లర్‌కి క్వింటాకు రూ.10లు వంతునా మిల్లింగ్ చార్జీలు సివిల్ సప్లయ్ కార్పొరేషన్ తరుపున ప్రభుత్వం చెల్లిస్తోంది. ఈయితే గత సీజన్ 2024 ఫిబ్రవరితో ముగిసింది. కానీ కొత్తప్రభుత్వం వచ్చాక మిల్లింగ్ చార్జీలు ఇప్పటివరకు చెల్లించలేదు.

వైఎస్సార్‌సీపీ హయాంలో సకాలంలో...

గత ఖరీఫ్‌లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతుల నుంచి 4,47,198 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించింది. దీనికి గానూ జిల్లాలోని 99,455 మంది రైతులకు నేరుగా వారి వ్యక్తిగత బ్యాంకు ఖాతాల్లో రూ.976.24 కోట్లు జమ చేయడం జరిగింది. అలాగే రైతుల కల్లాల నుంచి పీపీసీ కేంద్రాలకు, మిల్లులకు ధాన్యం రవాణా ఖర్చులు కూడా ఆ రైతులకు రూ.14.76 కోట్లు అప్పుడే చెల్లించారు. అయితే మిల్లింగ్ చేసిన బియ్యం అందిన తర్వాత మిల్లింగ్ చార్జీలు చెల్లించాల్సింది. కానీ మార్చి నెలలో ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో పాటు మిల్లర్లు అప్పటికి బియ్యాన్ని అందజేయకపోవడంతో వారి మిల్లింగ్ చార్జీలు గత ప్రభుత్వం మంజూరు చేయడం కుదరలేదు. అనంతరం ఎన్నికల నిబంధనలు అడ్డు వచ్చాయి. అయితే కొత్తగా వచ్చిన కూటమి ప్రభుత్వం జిల్లాలోని 262 మిల్లులకు రూ.42.30 కోట్లు చెల్లించాల్సి ఉంది. కానీ అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు గడుస్తున్నా ఇంకా చెల్లించకపోవడంతో మిల్లర్లు అందోళన చెందుతున్నారు.

జిల్లాలో పరిస్థితి

గత ఖరీఫ్ సీజన్‌లో మిల్లుల సంఖ్య	262
సేకరించిన ధాన్యం మెట్రిక్ టన్నుల్లో	4,47,198
ధాన్యం అమ్మిన రైతులు	99,455
ధాన్యం సేకరించిన సచివాలయాలు	586
ధాన్యం కొనుగోలు చేసిన పీపీసీలు	390
రైతులకు చెల్లించిన ధాన్యం నగదు	రూ.976.24 కోట్లు
ఇంకా ఎంత బకాయి ఉంది	గత ప్రభుత్వం పూర్తిగా చెల్లించింది
రైతులకు చెల్లించిన రవాణా చార్జీలు	రూ.14.76 కోట్లు
ఇంకా రవాణా చార్జీల బకాయిలు	లేవు
మిల్లర్లు కార్పొరేషన్‌కి తిరిగి అందజేసిన బియ్యం	3,02,563 మెట్రిక్ టన్నులు
మిల్లర్లకు చెల్లించాల్సిన మిల్లింగ్ చార్జీలు	రూ.42.30 కోట్లు
ఇప్పటివరకు మిల్లర్లకు ఎంత చెల్లించారు	ఇప్పటివరకు ఏమీ చెల్లించలేదు

ధాన్యం సేకరణకు సిద్ధం

మరలా రానున్న ఖరీఫ్‌లో ధాన్యం సేకరణకు అధికారులు సిద్ధమవుతున్నారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో జిల్లాలో 7 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనాలు వేస్తున్నారు. వీటిలో రైతుల స్థానిక వినియోగం నిమిత్తం 1.04 లక్షల మెట్రిక్ టన్నులు అవసరం ఉంటుందని, దీంతో మిగిలిన ధాన్యం సేకరణకు లక్ష్యం పెట్టుకున్నారు. ప్రస్తుతం ధాన్యం సేకరణ కేంద్రాల ఏర్పాటు, ఏజెన్సీలు నియామకం వంటి పనుల్లో ఉన్నారు.

ప్రజలను దోచుకునేందుకు సిద్ధమయ్యారు

- ఎమ్మెల్సీ నర్తు రామారావు



కవిటి: సంపద సృష్టిస్తామని నమ్మబలికి అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం,ప్రజలను దోచుకునేందుకు సిద్ధమయ్యిందని ఎమ్మెల్సీ నర్తు రామారావు మండిపడ్డారు. మండలంలోని కొత్తపుట్టుగలో సోమవారం ఆయన మాట్లాడారు. ఇప్పటికే నిత్యావసరాల ధరలు ఆకాశాన్ని తాకుతున్న తరుణంలో, తాజాగా విద్యుత్ చార్జీలను పెంచుకునేందుకు ప్రభుత్వం నిర్ణయించడం దారుణమన్నారు. రాష్ట్ర ప్రజలపై 6,070 కోట్ల విద్యుత్ వినియోగ భారాన్ని మోపి సామాన్యుడికి కరెంట్ షాక్ ఇచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికలకు ముందు విద్యుత్ చార్జీలను పెంచబోమని చెప్పిన చంద్రబాబు, అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు అవ్వగానే మాటమార్చి చార్జీల బాదుడు ప్రారంభించారన్నారు.

పోలీస్ స్టేషన్ ముట్టడిస్తాం

మాజీ మంత్రి సీదిరి అప్పలరాజును గృహ నిర్బంధం చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. ఒక ప్రణాళిక ప్రకారమే వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలను వేధిస్తున్నారని దుయ్యబట్టారు. పలాసలో జరిగిన ఘటన తీవ్ర భయాందోళనలు రేకెత్తిస్తోందన్నారు. సాక్షాత్తు పోలీస్‌స్టేషన్‌లోనే వైఎస్సార్‌సీపీ నాయకులపై దౌర్జన్యం చేయడం దారుణమన్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణించాయని ఆవేదన వ్యక్తం చేశారు. పలాస ఘటనలో దాడులకు పాల్పడిన వ్యక్తులను తక్షణమే అరెస్టుచేయాలని,లేనిపక్షంలో జిల్లా నాయకత్వంతో కలిసి పోలీస్‌స్టేషన్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు.

'రాష్ట్రాన్ని కేంద్రం పట్టించుకోవడం లేదు'

కాశీబుగ్గ: రాష్ట్రంలో కూటమి అధికారంలో ఉన్నా మోదీ ప్రభుత్వం రాష్ట్రాన్ని పట్టించుకోవడం లేదని సీపీఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు ఆరోపించారు. పలాసలో ఒక ప్రైవేటు కల్యాణ మండపంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రానికి మోదీ ప్రభుత్వం కనీసం నిధులు కేటాయించడం లేదని విమర్శించారు. అమరావతి రుణం కూడా మనపైనే భారం వేయాలని చూస్తున్నప్పటికీ దానికి చంద్రబాబు అంగీకారం తెలుపుతున్నారని అన్నారు. కేరళలో జీడి, కొబ్బరి పంటలకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నా ఆంధ్రాల్లో మాత్రం ఈ పంటలను పట్టించుకోవడం లేదన్నారు. పలాసలో సీపీఎం జిల్లా మహాసభలు నిర్వహించనున్నామని, ఈ మహాసభల్లో జిల్లాలో ఉన్న సమస్యలపై చర్చించి ఉమ్మడి ప్రణాళిక సిద్ధం చేస్తామన్నారు. సమావేశంలో సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బెండి తులసీదాస్, సీపీఎం జిల్లా కార్యదర్శి బి.గోవిందరావు, నాయకులు కోనారి మోహనరావు, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు

పాముకాటుతో రైతు మృతి



సోంపేట: మండలంలోని జింకిభద్ర గ్రామానికి చెందిన రైతు తాళ్ల లోకనాథం(62) పాముకాటుతో సోమవారం వేకువజామున మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. లోకనాథం ఆదివారం సాయంత్రం తన సొంత పొలంలో బెండకాయల కోతకు వెళ్లాడు. బెండకాయలు కోసే సమయంలో ఆయనకు పాముకాటు వేసింది. దీంతో బెండకాయలు తీసుకొచ్చి ఇంటి వద్ద విషయం చెప్పడంతో, కుటుంబ సభ్యులు సోంపేట సామాజిక ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్య కోసం టెక్కలి, శ్రీకాకుళం తరలించారు. శ్రీకాకుళంలో చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందాడు. అతనికి భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి

ఎచ్చెర్ల: లావేరు మండలం బుడుమూరు జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. ఇతను రోడ్డు దాటుతుండగా విశాఖపట్నం నుంచి శ్రీకాకుళం వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొంది. గుర్తు తెలియని వ్యక్తికి తీవ్రంగా గాయాలుకావడంతో గ్రామస్తులు 108కి ఫోన్‌చేసి చికిత్స నిమిత్తం రిమ్స్‌లో చేర్పించారు. అయితే అప్పటికే ఆయన మృతి చెందాడని వైద్యులు తెలిపారు. బుడుమూరు వీఆర్వో కామిశెట్టి నవీన్‌కుమార్ ఫిర్యాదు మేరకు ఎచ్చెర్ల ఎస్ఐ జి.లక్ష్మణరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సీమెన్ ఆత్మహత్య



గార: మండలంలోని బందరువానిపేట గ్రామానికి చెందిన సీమెన్ బొమ్మనాటి రమేష్ (34) ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రమేష్ ఐదు రోజులు క్రితం షిప్ నుంచి డ్యూటీ దిగి ఇంటికి వచ్చాడు. వచ్చినప్పటి నుంచి మద్యం ఎక్కువగా తీసుకుంటుండడంతో భార్య మందలించింది. గతంలో కూడా ఇదే విషయంలో ఇంట్లో తరచూ గొడవలు జరిగేవి. మనస్తాపానికి గురైన రమేష్ సోమవారం ఉదయం ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో ఫ్యాన్‌కు టవల్‌తో ఉరి వేసుకున్నాడు. మృతదేహాన్ని శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించి పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతునికి ముగ్గురు కుమారులున్నారు. తల్లి తులసమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ ఆర్.జనార్దన తెలిపారు.

త్వరితగతిన అర్జీల పరిష్కారం

- జిల్లా రెవెన్యూ అధికారి వేంకటేశ్వరరావు
- ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 142 వినతులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులను జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వేంకటేశ్వరరావు ఆదేశించారు. స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) మీకోసం కార్యక్రమం సోమవారం నిర్వహించారు. దీనిలో భాగంగా ప్రజల నుంచి 142 అర్జీలను స్వీకరించారు. వాటిని సంబంధిత అధికారులకు ఎండార్స్ చేసి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం 15 మందికి కారుణ్య నియామకాల్లో భాగంగా నియామకపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈవో శ్రీధర్ రాజు, ఉప కలెక్టర్ అప్పారావు, జిల్లా వైద్యారోగ్య అధికారి డా.బి.మీనాక్షి, డీసీహెచ్ఎస్ డా.కల్యాణ్ బాబు, డ్వామా పీడీ సుధాకర్, ఐసీడీఎస్ పీడీ శాంతిశ్రీ, జిల్లా ఉద్యాన అధికారి ఆర్.వరప్రసాద్ పాల్గొన్నారు.

న్యాయం చేయమంటే.. నిర్లక్ష్యం చూపారు

అరసవల్లి: వైద్యారోగ్య శాఖలో ఉద్యోగం ఇప్పిస్తానంటూ తనను మోసం చేసిన వారి వివరాలన్నీ ఆధారాలతో సహా అందించినా ఇంతవరకు తనకు డీఎంహెచ్‌ఓ బి.మీనాక్షి న్యాయం చేయలేదని, మోసం చేసిన వారిపట్లే సానుకూలంగా వ్యవహరిస్తున్నారంటూ నగరానికి చెందిన బాధితురాలు నేరుగా వైద్యశాఖ ఉన్నతాధికారులతో పాటు రీజనల్ డైరక్టర్ ఎం.శాంతిప్రభకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. రిమ్స్‌లో డీఈఓ పోస్టు అంటూ ఫేక్ సర్టిఫికెట్ ఇచ్చి నాలుగు నెలల పాటు ఆన్‌లైన్‌లో ఫేక్ అకౌంట్ ద్వారా జీతాలను చెల్లించి, ఉద్యోగం కోసం రూ.3 లక్షల వరకు డబ్బులు తీసుకుని మోసం చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అలాగే తనను మోసం చేసిన తీరుతో పాటు జిల్లా వైద్యశాఖాధికారులు తనపై చూపిన నిర్లక్ష్యాన్ని కూడా వివరిస్తూ ఫిర్యాదులో పేర్కొన్నట్లుగా వివరించారు.

ఫేక్ జాయినింగ్ ఆర్డర్ల వ్యవహారంతో పాటు ఉద్యోగాలిప్పిస్తామంటూ ఎందరినో మోసం చేసిన కార్యాలయ కీలక ఉద్యోగులపై సమగ్ర విచారణ చేపట్టి తద్వారా తనకు న్యాయం చేయాలని బాధితురాలు విజ్ఞప్తి చేశారు. ఇదే ఫిర్యాదును వైద్యశాఖ రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ, కమిషనర్‌తో పాటు సీఎం, డిప్యూటీ సీఎం కార్యాలయాలకు కూడా పోస్టు ద్వారా పంపించినట్లుగా బాధితురాలి భర్త శ్రీధర్ 'సాక్షి'కి తెలియజేశారు.

ఇసుక లారీ పట్టివేత



అధికారులు పట్టుకున్న ఇసుక లారీ

సరుబుజ్జిలి: ఆగని ఇసుక దందా పేరుతో సాక్షిలో సోమవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. దీనిలో భాగంగా తహసీల్దార్ ఎల్.మధుసూదన, ఎస్ఐ రాజేష్‌తో కలిసి దంతవరపుకోటలో దాడులు నిర్వహించారు. ఇసుక లోడింగ్‌తో తరలిపోవడానికి సిద్ధంగా ఉన్న లారీని స్వాధీనం చేసుకున్నారు. లారీ డ్రైవర్ పరారీకాగా, క్లీనర్‌తో పాటు, వారి సెల్‌ఫోన్లు కూడా స్వాధీనం చేసుకున్నారు. అలాగే దంతవరపుకోటలో అక్రమంగా నిల్వ చేసిన ఇసుక పోగులను సీజ్ చేశారు. పట్టుకున్న లారీని స్థానిక పోలీస్‌స్టేషన్‌కు అప్పగించామని, అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నవారిపై కఠినంగా వ్యవహరించడం జరుగుతుందన్నారు. దాడుల్లో రీసర్వే డీటీ జగదీష్, వీఆర్వోలు శ్రీనివాసరావు, అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): మున్సిపల్ కార్మికుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి ఎన్.బలరాం, ఉపాధ్యక్షుడు ఎ.గణేషులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ సోమవారం శ్రీకాకుళం కార్పొరేషన్ వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చట్టబద్ధమైన సెలవులు, వారాంతపు సెలవులు వెంటనే అమలు చేయాలన్నారు. పూర్తి స్థాయిలో పనిముట్లు, రక్షణ పరికరాలు ఇవ్వాలని కోరారు. 4 రకాల ఈపీఎఫ్ ఖాతాలను ఒకే ఖాతా కిందకు జమ చేయాలని డిమాండ్ చేశారు. విజయవాడ వరద ముంపు శానిటేషన్ స్పెషల్ డ్రైవ్‌లో పాల్గొన్న కార్మికులందరికీ ఒక నెల జీతం బోనస్‌గా ఇవ్వాలన్నారు. ధర్నా అనంతరం శ్రీకాకుళం కార్పొరేషన్ కమిషనర్ పి.వి.వి.డి.ప్రసాద్‌కు యూనియన్ నాయకులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కె.సూరయ్య, టౌన్ కన్వీనర్ ఆర్.ప్రకాశరావు, పంచాయతీ నాయకులు ఎ.జ్యోతిప్రసాద్, రాఘవ, ఇంజినీరింగ్ కార్మికులు పి.మణికంత, గిరిజాశంకర్, క్లాప్ డ్రైవర్లు నారాయణ, రామకృష్ణ, హరి, సత్తిబాబు, ఎ.శంకర్, డి.చిట్టి, ఎ.రాము, ఎ.శేఖర్, ఎ.దేవసంతోష్, పి.గణేష్, జె.మాధవి, ఎ.రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదు ఉపసంహరించుకుంటాం

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు లేబర్ కోర్టులో వేసిన ఫిర్యాదు వెనక్కి తీసుకోవాలని నిర్ణయించుకున్నారు. ఈ ఏడాది జనవరి 1వ తేదీన 34 మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను అప్పటి వీసీ నిమ్మ వెంకటరావు నియమించారు. అయితే ప్రస్తుత అధికారులు వారికి వేతనాలు చెల్లించకపోవడంతో లేబర్ కమిషన్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. అనంతరం ఈనెల 10న రెండు నెలల వేతనం వర్సిటీ అధికారులు చెల్లించారు. లేబర్ కమిషన్ కార్యాలయంలో మొదటి విచారణ సెప్టెంబర్ 18న చేశారు. రెండో విచారణ 19న చేశారు. ప్రస్తుతం సోమవారం విచారణ ఉండగా, ఫిర్యాదుదారులు ఉపసంహరించుకుంటున్నట్లు కమిషన్ ముందు చెప్పారు. అలాగే మరో మూడు నెలలు వేతనం చెల్లింపునకు అధికారులు చర్యలు తీసుకుంటున్నట్లు సమాచారం. బకాయి వేతనాలు పడిన వెంటనే ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ఫిర్యాదులు ఉపసంహరించుకోవాలని భావిస్తున్నారు. లేబర్ కమిషన్ సైతం నిబంధనల మేరకు వేతనాలు చెల్లించాలని వర్సిటీ అధికారులకు సూచించింది.

ఆలోచన.. ఆవిష్కరణ

- సృజనకు పదునుపెట్టిన విద్యార్థులు
- గురుకుల సీవోఈలో సైన్స్ ఎగ్జిబిషన్ ప్రారంభం
- 33 గురుకులాల నుంచి 88 నమూనాల ప్రదర్శన
- శ్రీకాకుళం జిల్లా నుంచి విద్యార్థుల హాజరు

మధురవాడ (విశాఖ జిల్లా):

గురుకుల విద్యార్థులు ప్రదర్శించిన నమూనాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. వీరి నమూనాలు చక్కటి సృజనాత్మకతకు అద్దం పట్టాయి. ఆధునిక సమాజం ఎదుర్కొంటున్న అనేక సమస్యలకు విద్యార్థులు చక్కటి పరిష్కారాన్ని చూపించే వర్కింగ్ నమూనాలు తయారు చేశారు. ఇవి సందర్శకులతో పాటు కలెక్టర్ హరేందిర ప్రసాద్‌ను సైతం ఔరా అనిపించాయి. ఈ అద్భుతమైన నైపుణ్యాలకు మధురవాడ సమీప కొమ్మాది రిక్షా కాలనీలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ వేదిక అయింది. ఏపీ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో 'ఫ్యూచర్ ఆన్' పేరుతో జోనల్ స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ సోమవారం ఏర్పాటు చేశారు. ఉత్తరాంధ్ర పరిధిలో ఉమ్మడి విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలు పరిధిలో లెక్కలు, సైన్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, హ్యుమానిటీస్‌తో పాటు ఆర్ట్ అండ్ క్రాఫ్ట్‌లో సీనియర్, జూనియర్ విభాగాల్లో 33 గురుకులాలు నుంచి వచ్చిన 150 మంది విద్యార్థుల 88 వర్కింగ్ నమూనాలు ప్రదర్శించారు. ఈ కార్యక్రమాన్ని కలెక్టర్ హరేందిర ప్రసాద్ ప్రారంభించారు. నమూనాలను పరిశీలించి విద్యార్థులను అభినందించారు. అనంతరం నిర్వహించిన సభలో ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ భరత్ మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగిన సృజనాత్మకత, అంతర్గత శక్తులను వెలికి తీయడానికి ఇటువంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. విద్యార్థులకు ప్రశ్నించే స్వేచ్ఛను ఉపాధ్యాయులు ఇవ్వాలన్నారు. ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు మాట్లాడుతూ ఉపాధికి ఉపయోగపడే విద్య అవసరమన్నారు. విశాఖ జిల్లా గురుకుల డీసీవో రూపావతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శాంతి కుమారి తదితరులు పాల్గొన్నారు.



ఫ్రీ ఎనర్జీ జనరేటర్

రూపకర్తలు: యు.హర్షిత ఇంటర్మీడియట్, ఐ.చాందిని ఇంటర్మీడియట్, ఎచ్చెర్ల
గైడ్ టీచర్: ఎం. శ్రీమొళ్ల

తక్కువ ఖర్చుతోనే ఫ్రీ ఎనర్జీ జనరేటర్ తయారు చేయవచ్చునని బాల మేధావులు నిరూపించారు. అన్ని రకాల ఇంధనాలు ఖర్చు విపరీతంగా పెరిగిపోవడం, కొరత వలన ప్రత్యామ్నాయ ఇంధనం ఆవశ్యకత అవసరం ఉందని వారు వివరించారు. తక్కువ ఖర్చుతో మానవ ఆరోగ్యానికి ఎటువంటి హాని లేని ఎకో ఫ్రెండ్లీ ఇంధనం తయారు చేయవచ్చునని నిరూపించారు.

ట్రాఫిక్ అలెర్ట్ - పర్యావరణ రక్షణ సిస్టం

రూపకర్తలు: డి.విశ్వనాథ్, ఎం.అశోక్, 8వ తరగతి, సబ్బవరం
గైడ్ టీచర్: డాక్టర్ టి.రాంబాబు, ప్రిన్సిపాల్ యన్.రామకృష్ణ

మానవ ఆరోగ్యకర జీవనంలో ట్రాఫిక్ హెచ్చరికలు, పర్యావరణ పరిరక్షణ వ్యవస్థ విశేషమైన పాత్ర పోషిస్తున్నాయి. ప్రస్తుతం దేశంలో కాలుష్యం పెరిగిపోతోంది. ఈ నేపథ్యంలో కాలుష్య నివారణ, పర్యావరణ పరిరక్షణ చాలా ముఖ్యం. ట్రాఫిక్ అలెర్ట్–పర్యావరణ రక్షణ సిస్టం ప్రాజెక్టు పర్యావరణ పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తుంది. దీనిలో ఉండే సెన్సార్ ద్వారా గ్రహించే కాలుష్య శాతం ఎల్ఈడీలో చూపిస్తుంది. కాలుష్య శాతం ఎక్కువ ఉంటే హెచ్చరికలు జారీ చేస్తుంది.

ఆటోమెటిక్ పార్కింగ్ సిస్టం

రూపకర్తలు: ఎం.రుడా ఇవాంజలిన్, ఇంటర్ ద్వితీయ సంవత్సరం, వై.ప్రవళిక సాయిప్రియ, 10వ తరగతి, మధురవాడ
గైడ్ టీచర్: ఉష

పట్టణ జనాభా విపరీతంగా పెరుగుతున్న తరుణంలో పార్కింగ్ పెద్ద సమస్యగా మారింది. అందుకే ఆటోమెటిక్ కార్ పార్కింగ్ ద్వారా ఈ సమస్యకు చక్కని పరిష్కారం లభిస్తుంది. ఈ ప్రక్రియ అంతా సాంకేతికత సహాయంతో ఆటోమేటిక్‌గా జరుగుతుంది. పైగా పార్కింగ్ ఆక్యుపెన్సీ కూడా ఎల్ఈడీ ద్వారా ప్రదర్శిస్తుంది.